# డల్లాస్‌లో 'నెల నెలా తెలుగు వెన్నెల'



డల్లాస్, ఆగస్టు 23: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ తెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'నెల నెలా తెలుగు వెన్నెల' మొదటి కార్యక్రమం సాహిత్య పరిమళాలు పూయించింది. ఇర్వింగ్‌లోని 'ఇండ్యా ఫ్యూజన్' రెస్టారెంట్‌లో దిగ్విజయంగా జరిగింది. తానా ప్రధాన కార్యదర్శి ప్రసాద తోటకూర నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హ్యూస్టన్ నివాసి, ప్రముఖ సాహితీ వేత్త, రచయిత, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అధ్యక్షులు డా. చిట్టెన్ రాజు విచ్చేశారు. టాంటెక్స్ అధ్యక్షులు డా. రాజారెడ్డి అధ్యత వహించారు.

సభ్యుల పరిచయ కార్యక్రమం తరువాత తోటకూర ప్రసాద్ ప్రారంభోపన్యాసం చేస్తూ... సాహిత్య వేదిక స్థాపనోద్దేశ్యాలను వివరించారు. తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు చేపట్టి వలసిన చర్యలను డా. వంగూరి చిట్టెన్ రాజు తన ప్రధానోపన్యాసంలో చక్కగా వివరించారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా, విదేశాల్లో ఉన్న తెలుగు వారందరూ ప్రతిరోజూ ఒక గంటసేపు ఏదో ఒక తెలుగు పుస్తకం చదవడం, సాహితీ ప్రియులు 'నెలనెలా తెలుగు వెన్నెల' లాంటి కార్యక్రమాలు ప్రతీ ఊళ్లోనూ నిర్వహించడం, ప్రవాస తెలుగువారు సొంత ఊళ్లకు వెళ్ళినప్పుడల్లా కేవలం ఒక పూట కేటాయించుకుని

ఇటువంటి వేదికను తమ ప్రాంతాల్లో నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా తెలుగు భాష, సాహిత్యం రాష్ట్ర, దేశ, స్థాయిల నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

చిత్తశుద్ధితో నిర్వహించే సాహిత్య కార్యక్రమాలకు తెలుగు వారందరూ పూర్తిగా సహకరిస్తారని వంగూరి చిట్టెన్ రాజు చెప్పారు. అప్పుడే తెలుగు భాషకు ఈ రోజుల్లో అత్యవసరమైన 'గ్లామర్', ధనిక వర్గాల మద్దతు లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మన భాషని, మన సంస్కృతిని మనసా, వాచా, కర్మణా గౌరవించుకుంటేనే కేంద్ర ప్రభుత్వం వారి ప్రాచీన భాషా ప్రతిపత్తి రానీ, యునైటెడ్ నేషన్స్ వారి 'మరణించబోయే భాషల పట్టీ' లోంచి తెలుగు తొలగించడం కానీ జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

టాంటెక్స్ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ ఈ వేదికకు తమ పూర్తి సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. వేదిక సభ్యులు సాహితీ వేదిక అభివృద్ధికి పలు సూచనలు చేశారు. ప్రముఖ కవి, అవధాని "నీలంపంత" స్వీయ కవితలతో పాటు, చంగారి సుభాష్ రచించిన 'మిరపకాయ బజ్జీ విలాపం' కవిత, డా. అక్కి శ్రీనివాస రెడ్డి ఆలపించిన జానపద గేయాలు, 60వ భారత స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా చింతమూరి శివరామారావు మొదలైన వారి దేశభక్తిగీతాలు, 'అమెరికా హాస్య బ్రహ్మ' వంగూరి చిట్టెన్ రాజు చదివిన హాస్య కవితలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సభికుల సూచనలను సమీక్షిస్తూ, తోటకూర ప్రసాద్ ప్రతిపాదించిన నిర్ణయాలను అందరూ ఆమోదించారు. ఇక నుంచి ప్రతి నెలా మూడవ ఆదివారం ఈ 'నెల నెలా తెలుగు వెన్నెల' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాహితీవేత్తలను ఆహ్వానిస్తారు. సభికులు ఉత్సాహంగా స్పందించి రెండు వేల డాలర్లకు పైగా విరాళాలు అందించారు. ప్రసాద్ తోటకూర వందన సమర్పణ చేశారు. కార్యక్రమానికి సహకరించిన దేవూరి కోటేశ్వరరావు (కెకె), ఇతర ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.

గత జూలై 21న టాంటెక్స్ ఆధ్వర్యంలో తెలుగు సాహిత్య వేదికను ప్రముఖ రచయిత గొల్లపూడి మారుతీరావు, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. ఆవుల మంజులత లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. 'నెలనెలా తెలుగు వెన్నెల' రెండవ కార్యక్రమం సెప్టెంబర్ 16వ ఇర్వింగ్‌లోని అవర్ ప్లేస్ ఇండియన్ రెస్టారెంట్‌లో జరుగుతుందని, ఓక్లహామా యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డా. వేదాల శ్రీనివాసాచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.